# అబద్ధాలు

మా రెండో పాపకి ఆరేళ్ళు.

అది ఆటువుగా అబద్ధాలు చెబుతుంది. అవసరమనీ లేదు. అనవసరమనీ లేదు. అబద్ధాలు చెప్పటమే తన జీవిత ధ్యేయం లాగ నోరు విప్పితే చాలు అబద్ధాలు. ఆ అలవాటు ఎలా మాన్పించాలో అర్థం కావటంలేదు.

పిల్లిలాగ మెల్లగా వచ్చింది అది.

"ఏమ్మా! ఏం కావాలి?"

"నాన్నా ... మ రే మొ చ్చి ... మా స్కూల్లో లలిత వుంది కదా....అదే మొచ్చి ...నన్ను పోలీస్‌స్టేషన్లో పెట్టిం చెస్తానంది ..."

చచ్చేను!

ఈ కంప్లెయింట్ సీరియస్‌గా తీసు కొని టీచర్‌కి రిపోర్టు యివ్వలేను. అలా గని నిర్లక్ష్యం చేసి మానెయ్యలేను.

ఇంతకు మునుపు ఒకసారి యిలాగే అబద్ధపు కంప్లెయింట్ చేసి నన్ను అభాసుపాలు చేసింది.

"నిజమే?"

"నిజం నాన్నా .. సరస్వతోడు...."

"ఛప్ ...నోర్ముయ్...." లేని కోపం నటిస్తూ కళ్ళు పెద్దవి చేశాను.

అది భయంతో వణికింది.

"నిజమేనా?...." గర్జించాను.

"ఉహూఁ .." భయం భయంగా తల అడ్డంగా తిప్పింది.

వెంటనే స్వరం మార్చేశాను.

"తప్పు తల్లీ....అలా అబద్ధాలు చెప్ప కూడదు. అబద్ధాలు చెపితే....మరేమో ... వచ్చే జన్మలో బొద్దింకలై పుడతారు."

దాని కళ్ళు భయం భయంగా చూశాయి.

బొద్దింకలంటే దానికి చెప్పలేనంత భయం.

"ఇంకెప్పుడూ యిలా అబద్ధాలు చెప్పవుగా?" అనునయంగా అడిగాను.

"చెప్పను" అంటూ తల వూపింది.

"రైట్....యింక వెళ్ళి ఆడుకో...."

"అలాగే ...." అన్నట్టు తల వూపింది. కాని వెళ్ళకుండా అక్కడే నిలుచుని "నాన్నా...." పిలిచింది సందే హంగా.

"ఏమ్మా?"

"మరేమొచ్చి ...వచ్చే జన్మలో.... నువ్వేమొచ్చి ... బొద్దింకగా పుడ తావా? .. "

షాక్ తిన్నాను!

"ఎందువలాగ?"

"మరేమో....నిన్న, అల్ల వాళ్ళెవరో వస్తే ..మనిల్లు ఎవరికీ అద్దె కివ్వ లేదన్నావేం? బాబీ వాళ్ళమ్మా నాన్నా అద్దెకే వుంటున్నారుగా....మరి అబద్ధం చెప్పావా నాన్నా?...."

వాళ్ళు, అంటే నిన్న సాయంత్రం వచ్చిన వాళ్ళు, హౌస్ టాక్సు అసెస్ మెంటుకి వచ్చారు.

పాపకి నేనేం జవాబు చెప్పను?

—శ్రీవాణి